క్లుప్తంగా

ఉపాధ్యాయుడికి సన్మానం



సోమశేఖరరావును సన్మానిస్తున్న హెచ్ఎం, సహోపాధ్యాయులు, సిబ్బంది

సీతానగరం: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో బయాలజీ ఉపాధ్యాయుడుగా పని చేస్తున్న సోమశేఖరరావును హెచ్ఎం ఇల్లా ప్రసన్నలక్ష్మి ఆధ్వర్యంలో సహచర ఉపాధ్యాయులు, ఎస్ఎంసీ కమిటీ సభ్యులు శనివారం సన్మానించారు. ఈ మేరకు హెచ్ఎం ఇల్లా ప్రసన్నలక్ష్మి మాట్లాడుతూ సోమశేఖరరావు ఎన్ఐటీఎస్(నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ట్రెనింగ్ ఫర్ స్టాండైజేషన్) నోయిడాలో జరిగిన లెర్నింగ్ సైన్స్ వయా స్టాండర్డ్ డైజేషన్ శిక్షణ కార్యక్రమానికి పార్వతీపురం మన్యం జిల్లా నుంచి హాజరయ్యే అవకాశం దక్కిందని అన్నారు. నొయిడాలో ఈ నెల 24, 25 తేదీల్లో జరిగిన శిక్షణా కార్యక్రమానికి హాజరయ్యారన్నారు. స్టాఫ్ సెక్రటరీ డి.రామారావు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

అసౌకర్యాల నడుమ పాఠశాలలు



దొగ్గవానిములగలో శిథిలావస్థలో ఉన్న వంటశాల

పార్వతీపురం రూరల్: పలు ప్రభుత్వ పాఠశాలలు అసౌకర్యాల నడుమే నిర్వహిస్తున్నారు. పలు పాఠశాలలకు మౌలిక సదుపాయాలు కల్పించకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నాడు – నేడు మొదటి విడతలో నిర్మాణాలు పూర్తయినప్పటికీ రెండో విడత నాడు–నేడులో మంజూరైన పాఠశాలలు నిర్మాణాలు పూర్తి కాకపోవడంతో విద్యార్థులు అసౌకర్యానికి గురవుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నా అసంపూర్తిగా ఉన్న నిర్మాణాలపై దృష్టి సారించకపోవడంతో విద్యార్థులకు అవస్థలు తప్పడం లేదు. మండలంలోని ములక్కాయవలస, ములగ, గంగాపురం, దొగ్గవానిములగ తదితర గ్రామాల్లోని పాఠశాలలు నిర్మాణం పూర్తికాక, మరుగుదొడ్లు లేక, తాగునీరులేక, వంటశాలలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

మెగా జాబ్‌మేళాకు విశేష స్పందన

సాలూరు: ఏపీ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో పట్టణంలో శనివారం నిర్వహించిన మెగా జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. 12 ప్రముఖ కంపెనీల్లో 415 ఉద్యోగాల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహించినట్టు అధికారులు తెలిపారు. జాబ్‌మేళాకు మంత్రి సంధ్యారాణి ముఖ్య అతిథిగా పాల్గొని, జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు అధికారులు, అభ్యర్థులు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని కురుపాం ఎస్ఐ పి.నారాయణరావు సూచించారు. కురుపాం మండలంలోని గుజ్జిపాడు గ్రామాన్ని శనివారం సందర్శించిన ఆయన గ్రామస్తులతో సమావేశమై, సైబర్ నేరాల పై అవగాహన కల్పించారు. అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్ మాట్లాడవద్దని, బ్యాంకు వివ రాలు అడిగితే చెప్పవద్దన్నారు. పొరపాటున ఫోన్ లో ఓటీపీ చెప్పినట్లయితే ఖాతాలో ఉన్న నగదును ఖాళీ చేస్తారన్నారు. మైనర్లకు నడిపేందుకు వాహ నాలు ఇవ్వవద్దన్నారు. మందు తాగి వాహనం నడి పినా, హెల్మెట్ ధరించక పోయినా ప్రమాదం జరిగి తే చనిపోయే అవకాశం ఉందన్నారు. అలాగే యువ త, విద్యార్థులంతా మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, ఉన్నతమైన జీవనం సాగించాలని తెలిపారు.

ఆ పీహెచ్‌సీలో అన్నీ సమస్యలే...:

- వైద్యాధికారి, హెచ్‌వీ, స్టాఫ్‌నర్స్‌లకు బదిలీ
- రిలీవర్ల కోసం ఎదురుచూపులు
- సచివాలయ ఏఎన్ఎంలకు త్వరలో బదిలీలు?
- పీహెచ్ఎన్, రెండు హెల్త్ సూపర్‌వైజర్ల పోస్టులు ఖాళీ
- అదనపు భారంతో ఉక్కిరిబిక్కిరవుతున్న ఆశా వర్కర్లు
- బిల్లులందక పూర్తికాని ఆసుపత్రి భవనం
- ఇబ్బందులు పడుతున్న వైద్య సిబ్బంది, రోగులు



బిల్లులందక నిలిచిన ఆసుపత్రి భవన నిర్మాణ పనులు



శిథిలావస్థకు చేరుకున్న పీహెచ్‌సీ భవనం

మక్కువ: మక్కువ పీహెచ్‌సీని సిబ్బంది కొరత, వసతి సమస్య వెంటాడుతున్నాయి. వర్షాకాలం ఆరంభం కావడంతో, అడపా దడపా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందుతున్నాయి. ఈ క్రమంలో సిబ్బంది కొరతతో రోగులకు వైద్యసేవలు అంతంతమాత్రంగానే అందుతున్నాయి. మక్కువ పీహెచ్‌సీ పరిధిలో 9 హెల్త్ విలేజ్ క్లినిక్‌లు ఉండగా, వాటి పరిధిలో 36గ్రామాలు ఉన్నాయి. వారందరికి సకాలంలో వైద్య సేవలందించాలంటే, సిబ్బంది పూర్తి స్థాయిలో నియమించాల్సి ఉంది. అలాగే ప్రస్తుతం రోగులకు సేవలందిస్తున్న ఆసుపత్రి శిథిలావస్థకు చేరుకోవడంతో కొన్ని గదులు వర్షానికి కారిపోతున్నాయి. రోగులు సేద తీరేందుకు విశ్రాంతి గది లేకపోవడంతో ఆరుబయట వేచిచూడాల్సిన పరిస్థితి నెలకొంది. ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు వైద్యులు ఒకే గదిలో రోగులకు వైద్యసేవలందిస్తున్నారు. ఆసుపత్రి ఆవరణలో నూతనంగా భవనం నిర్మాణ పనులు పూర్తయినప్పటికీ ప్రారంభానికి నోచుకోకపోవడంతో రోగులకు అవస్థలు తప్పడం లేదు.

బదిలీ అయిన వారు.. రిలీవర్ల కోసం వెయిటింగ్..

పీహెచ్‌సీ వైద్యాధికారి హరికృష్ణకు ఏలూరు బదిలీ కాగా, హెచ్‌వీకి మక్కువ మండలం శంబర, స్టాఫ్‌నర్స్‌కు సాలూరు మండలం మామిడిపల్లికి బదిలీ అయ్యింది. వీరి స్థానంలో విధులు నిర్వహించాల్సిన వైద్యాధికారి, హెచ్‌వీ, స్టాఫ్‌నర్స్ ఇంకా పీహెచ్‌సీలో జాయిన్ కాలేదు. వీరంతా తమ రిలీవర్ల కోసం ఎదురు చూస్తున్నారు.

వైద్య సిబ్బంది కొరత

పీహెచ్‌సీలో ఇద్దరు హెల్త్ సూపర్‌వైజర్లు ఉండాల్సి ఉండగా, రెండు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. పీహెచ్ఎన్ పోస్టు ఖాళీగా ఉంది. గతంలో నలుగురు హెల్త్ అసిస్టెంట్‌లు విధులు నిర్వహించేవారు. ప్రస్తుతం ఇద్దరు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. త్వరలో సచివాలయ ఏఎన్ఎంలకు ప్రభుత్వం బదిలీలు నిర్వహించనుంది. ఈ క్రమంలో రోగులకు వైద్య సేవలు అంతంతమాత్రంగానే అందనున్నాయి.

శిథిలావస్థలో పాత భవనం.. ప్రారంభానికి నోచుకోని కొత్త భవనం

మక్కువ పీహెచ్‌సీ భవనం శిథిలావస్థకు చేరుకుంది. వర్షం కురిస్తే ఆపరేషన్ థియేటర్ గది కారిపోతుంది. పీహెచ్‌సీ ఆవరణలో రోగులకు అవసరమైన ఆసుపత్రి భవనం రూ.1.20 కోట్లతో నిర్మిస్తున్నారు. 90శాతం వరకు పనులు జరిగాయి. బిల్లులు అందకపోవడంతో, నిర్మాణ పనులు తాత్కాలికంగా నిలిచిపోయాయి. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి మక్కువ పీహెచ్‌సీలో నెలకొన్న వసతి, సిబ్బంది కొరత సమస్యను పరిష్కరించాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

ఆశా వర్కర్లపై అదనపు భారం

మండల కేంద్రం మక్కువలో 9 మంది ఆశా వర్కర్లు విధులు నిర్వహిస్తున్నారు. పదేళ్ల క్రితం జనాభా ప్రాతిపదికన ఆశా వర్కర్లను ప్రభుత్వం నియమించింది. ప్రస్తుతం మక్కువలో జగనన్న కాలనీలో సుమారు 350 గృహాలు నిర్మించుకున్నారు. పలు కాలనీల్లో గృహాలు నిర్మించుకున్నారు. పదేళ్లతో పోల్చితే, ప్రస్తుతం జనాభా పెరిగింది. దీంతో ప్రజలకు వైద్యసేవలందించేందుకు ఆశా వర్కర్లు ఇబ్బందులు పడుతున్నారు. పీహెచ్‌సీ పరిధిలోని ఎ.వెంకంపేట, అడ్డుమండ, లోతుగెడ్డ గ్రామాలలో ఒక్క ఆశా వర్కరే విధులు నిర్వహిస్తున్నారు. అలాగే డి.శిర్లాం, లోవరఖండి, గొడేవలస, కొత్తలోవరఖండి గ్రామాలలో కూడా ఒక్క ఆశా వర్కరే విధులు నిర్వహించడంతో వారిపై అదనపు పని భారం పడుతుంది.

అండగా ఉంటాం..



వైస్ ఎంపీపీ రెడ్డి సురేష్ కుటుంబీకులను పరామర్శిస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, మాజీ ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర

సాలూరు: మండల వైస్ ఎంపీపీ రెడ్డి సురేష్ కుటుంబానికి తాము అండగా ఉంటామని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, మాజీ ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర భరోసా ఇచ్చారు. ఈ మేరకు సురేష్ తండ్రి, జెడ్పీటీసీ మాజీ సభ్యులు రెడ్డి తిరుపతిరావు ఇటీవల మృతి చెందగా ఆయన కుటుంబ సభ్యులను బాగువలసలో శనివారం వారు పరామర్శించారు. సురేష్ కుటుంబ సభ్యులకు తమ సంతాపం తెలిపారు. పట్టణంలో ఇటీవల అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మూడో వార్డు కౌన్సిలర్ తాడ్డి శంకరరావు కుమారుడు తాడ్డి నాయుడును వారు పరామర్శించారు. ఆయన క్షేమ సమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు. బవిరెడ్డి సత్యప్రసాద్ బావ ఇటీవల మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను కూడా పరామర్శించి ఓదార్చారు. వారి వెంట పలువురు పార్టీ నాయకులు ఉన్నారు.

కొటియాలో ఘనంగా రథయాత్ర

సాలూరు రూరల్: ఒడిశా–ఆంధ్రా సరిహద్దు గ్రామం కొటియాలో శనివారం జగన్నాథ రథ యాత్రను ఘనంగా నిర్వహించారు. ఏటా నిర్వహించనట్టుగానే ఈ ఏడాది కూడా జగన్నాథ స్వామి రథయాత్ర ఒకరోజు ఆలస్యంగా నిర్వహించారు. ఒడిశా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కె.వి.సింగ్ హాజరై స్వామివారికి తొలిపూజ జరిపారు. కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు బిభూతీ భూషణ్‌జనా, నిత్యానంద గండ్, గోకులానందతో పాటు అధికారులు పాల్గొన్నారు. స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

జూలై 1న జాబ్‌మేళా

గుమ్మలక్ష్మీపురం: సీతంపేట ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో జూలై 1వ తేదీన జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు భద్రగిరి ఆర్ఐటీఐ ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ మూటక గోపాలకృష్ణ ఓ ప్రకటనలో శనివారం తెలిపారు. బెంగళూరుకు చెందిన సన్‌రైజస్ వర్క్ ఫోర్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఈ జాబ్‌మేళా నిర్వహిస్తోందని, ఐటీఐలో ఫిట్టర్, ఎలక్ట్రీషియన్, మెకానిక్ డీజిల్, వెల్డర్, మెకానిక్(మోటార్ వెహికల్) ట్రేడ్‌లలో ఉత్తీర్ణులైన వారు, ప్రస్తుతం చివరి సంవత్సరం చదువుతున్న వారు అర్హులన్నారు. ఆసక్తి ఉన్న వారంతా బయోడేటా, టెన్త్ మార్క్‌లిస్ట్, ఐటీఐ పాసైన ధ్రువపత్రాలు, ఆధార్‌కార్డు జిరాక్స్, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో ఉదయం 9 గంటలకు హాజరుకావాలన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్లు 6304086821, 9493128352 సంప్రదించాలని కోరారు.

గ్రామాల్లో విధిగా పారిశుధ్య పనులు చేపట్టాలి



నిడగల్లులో చెత్త తరలింపుపై ఆరా తీస్తున్న ఎంపీడీవో

సీతానగరం: గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలడానికి మూల కారణమైన దోమల నివారణకు ముందు జాగ్రత్త చర్యగా పారిశుధ్య పనులు నిర్వహించి, వీధుల్లో చెత్త కుప్పలను దూర ప్రాంతాలకు తరలించాలని ఎంపీడీవోఎంఎల్ఎన్ ప్రసాద్ అన్నారు. మండలంలోని నిడగల్లు, ముత్యాలదొరవలస గ్రామాల్లో శనివారం జరిగిన పారిశుధ్య పనులను ఆయనతో పాటు డిప్యూటీ ఎంపీడీవో కె.కుమారవర్మ పరిశీలించారు. ఈ మేరకు ప్రసాద్ మాట్లాడుతూ వర్షాలు కురవడంతో దోమలు చేరే అవకాశం ఎక్కువగా ఉన్నందున ప్రజలు వివిధ రకాల వ్యాధులకు గురికాకుండా ఉండేందుకు ముందు జాగ్రత్త చర్యగా దోమలు నివారణా మందులు పిచికారీ చేయిస్తున్నట్టు తెలిపారు. కాలువల్లో పూడికల తొలగింపు చర్యలను కార్యదర్శులు చేయించాలని సూచించారు. మండలంలో ఇప్పటికే పది గ్రామాల్లో పారిశుధ్య పనులు నిర్వహిస్తున్నారని, చెత్తను ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాలకు తరలిస్తున్నట్టు తెలిపారు. అనంతరం వాటర్ ట్యాంక్‌ను పరిశీలించి ఇంటింటికీ అందుతున్న మంచి నీటిని పరిశీలించారు. అనంతరం వైస్ ఎంపీపీ టి.సూర్యనారాయణ, సర్పంచ్ ఆరుద్రమ్మలతో పారిశుధ్య పనుల నిర్వాహణపై సమీక్షించారు.

నిలిచిన వసతిగృహ నిర్మాణం



పనులు నిలిచిపోయిన గర్భిణులు, బాలింతల వసతిగృహ నిర్మాణం

సాలూరు రూరల్: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో తోణాం పీహెచ్‌సీ వద్ద గర్భిణులు, బాలింతల వసతిగృహ నిర్మాణ పనులు ప్రారంభించారు. అప్పట్లో ఈ భవన నిర్మాణం 80 శాతం వరకు పనులు పూర్తి చేసుకుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదైనా మిగిలిన పనుల పూర్తికి చర్యలు తీసుకోవడం లేదు. దీని నిర్మాణం పూర్తయితే గిరి శిఖర గ్రామాల ప్రజలకు ఎంతో మేలు చేకూరుతుందని ఆశిస్తున్నారు. వెంటనే దీన్ని పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని గిరిజనులు కోరుతున్నారు.

ఎంఆర్‌పీకే ఎరువులు విక్రయించాలి



డీలర్లతో సమావేశం నిర్వహిస్తున్న ఏవో

మక్కువ: ప్రభుత్వం నిర్దేశించిన ధరలకే, ఎరువులు విక్రయించాలని వ్యవసాయధికారిణి చింతల భారతి డీలర్లకు ఆదేశించారు. స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో డీలర్లతో ఆమె శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎరువులు దుకాణాలకు సంబంధించి రికార్డులను ఏవో భారతి పరిశీలించారు. డీలర్లనుద్దేశించి ఆమె మాట్లాడుతూ ఎంఆర్‌పీకే ఎరువులు విక్రయించాలని, ఎరువులు కొనుగోలు చేసిన రైతులకు బిల్లులు అందించాలన్నారు. అలాగే అధిక మొత్తంలో ఎరువులు విక్రయించరాదన్నారు. ఎంఆర్‌పీ కంటే అధికంగా విక్రయిస్తున్నట్టు ఫిర్యాదులొస్తే సంబంధిత ఎరువుల దుకాణాల లైసెన్స్ రద్దు చేస్తామన్నారు. మండలంలోని పలు దుకాణాల నుంచి ఒడిశా రాష్ట్రానికి ఎరువులు తరలిస్తున్నారని వస్తున్న ఆరోపణల్లో నిజం లేదన్నారు. సమావేశంలో డీలర్లు పాల్గొన్నారు.

ఆర్ఎస్‌కేలలో అందుబాటులో యూరియా



మక్కువ ఆర్ఎస్‌కే గొడౌన్‌లో యూరియా నిల్వ చేస్తున్న దృశ్యం

మక్కువ: మండలంలోని రైతు సేవా కేంద్రాలలో, సొసైటీలలో ఎరువులు నిల్వ చేసేందుకు వ్యవసాయ శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. సాక్షిలో ఎరువులు అమ్మలేం అన్న కథనం శుక్రవారం ప్రచురితమవడంతో ఏవో చింతల భారతి స్పందించారు. ఫెర్టిలైజర్స్ కంపెనీల ఒత్తిడి, ఎంఆర్‌పీ ధరలకే విక్రయించాలంటూ అధికారుల ఆదేశాలతో డీలర్లు ఇలా అయితే ఎరువులు విక్రయించలేమంటూ గగ్గోలు పెడుతున్న విషయం తెలిసిందే. ఈ మేరకు రైతులు పంటల సాగుకు అవసరమైన ఎరువులను ఆర్ఎస్‌కేలలో, సొసైటీలో నిల్వ చేసేందుకు వ్యవసాయ శాఖ అధికారులు చర్యలు చేపడుతున్నారు. మండలంలోని 6 రైతు సేవా కేంద్రాలకు సుమారు 1500 బస్తాలు యూరియాను శనివారం తెప్పించామన్నారు. సొసైటీలకు కూడా సుమారు 440 బస్తాలు తెప్పించామని ఏవో భారతి తెలిపారు. మిగిలిన రైతు సేవా కేంద్రాలన్నిటీలో ఒకటి, రెండు రోజుల్లో యూరియా అందుబాటులో ఉంచుతామన్నారు.

సంక్షేమ వసతిగృహాల్లో ఏఎన్ఎంలను నియమించాలి



సాంఘిక సంక్షేమ వసతిగృహాన్ని పరిశీలిస్తున్న సీపీఐ జిల్లా కార్యదర్శి జీవన్

పార్వతీపురం టౌన్: సంక్షేమ వసతిగృహాల్లో ఏఎన్ఎంలను వెంటనే నియమించి, మౌలిక సదుపాయాలు కల్పించాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట జీవన్న డిమాండ్ చేశారు. సీపీఐ ఆధ్వర్యంలో జిల్లాలో సంక్షేమ వసతిగృహాల సందర్శనలో పార్వతీపురం పట్టణంలో ఉన్న వివిధ వసతిగృహాలను విద్యార్థుల తల్లిదండ్రులతో కలసి సంక్షేమ వసతిగృహాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల హామీల్లో భాగంగా కూటమి అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో సంక్షేమ వసతిగృహాల్లో మౌలిక వసతులను కల్పిస్తామని, ఏఎన్ఎంలను నియమించి విద్యార్థులతో ఆరోగ్యాలు పరీక్షిస్తామని ఎన్నికల హామీల్లో ఇచ్చారు. కూటమి అధికారంలోకి వచ్చిన ఏడాది కావస్తున్నా.. ఇచ్చిన హామీలు ఇంతవరకు అమలు చేయలేదని, ఇకనైనా కూటమి ప్రభుత్వం సంక్షేమ వసతిగృహాల్లో మౌలిక వసతులు కల్పించి, ఏఎన్ఎంలను నియమించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు గరుగుబిల్లి సూరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐపై చర్యలు తీసుకోవాలి



తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందిస్తున్న ప్రెస్‌క్లబ్ సభ్యులు

సాలూరు: విధి నిర్వహణలో ఉన్న జర్నలిస్టు పట్ల దురుసుగా ప్రవర్తించిన విజయనగరం టు – టౌన్ ఎస్ఐ మురళిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సాలూరు ప్రెస్‌క్లబ్ డిమాండ్ చేసింది. శనివారం పట్టణ ప్రెస్‌క్లబ్ కార్యదర్శి అల్తి మధు, క్లబ్ పూర్వ అధ్యక్షుడు బంకురు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సమావేశమైన ప్రెస్‌క్లబ్ సభ్యులు, విధి నిర్వహణలో ఉన్న విజయనగరం 10 టీవీ స్టాఫ్ రిపోర్టర్ ఎంఎల్ నాయుడు పట్ల టు టౌన్ ఎస్ఐ వ్యవహరించిన తీరును ఖండించారు. ఈ మేరకు తహసీల్దార్ నీలకంఠరావుకు వినతిపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో సభ్యులు బాలి విశ్వేశ్వరరావు, నల్లి శ్రీను, ఆరంగి సీతారాం, సుబ్రహ్మణ్యం, మోహన్, గుప్త, తవిటి నాయుడు, దేవేంద్ర, ప్రశాంత్ తదితరులు ఉన్నారు.

నారుమళ్ల నిర్వహణలో జాగ్రత్తలు అవసరం

- అధిక వర్షాలపై ఆందోళనక్కర్లేదు..
- రైతులకు వ్యవసాయాధికారుల సూచనలు



రైతులు సిద్ధం చేసిన నారుమడి

బలిజిపేట: అధిక వర్షాల సమయంలో నారుమళ్ల సంరక్షణలో రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. వరి పంట సాగు చేసుకునే క్రమంలో కొందరు ఊడ్పుల విధానంలో, మరికొందరు వెదజల్లు సాగును చేపడుతుంటారు. కురుస్తున్న వర్షాలు, చిరుగాలులతో కూడిన చిరుజల్లులు, తక్కువ ఉష్ణోగ్రతల నమోదు, అధిక తేమ శాతం ఉన్న పరిస్థితుల్లో వరి నారుమడి దశలో తెగుళ్లు అధికంగా ఆశించే అవకాశం కనిపిస్తుంది. వ్యవసాయాధికారుల సూచనలు పాటించి ఆరోగ్యవంతమైన వరి నారుమడులను తయారుచేసి, ఆరోగ్యవంతమైన నారును పెంచవచ్చు.

నారుమడులు ఇలా..

వరి నారుమడిని మూడు విడతలుగా దమ్ము చేసి చదును చేయాలి, కొంచెం ఎత్తుగా, నారుమడిలో నీరు నిల్వ ఉండకుండా ఉండేలా, నీరు పెట్టడానికి, తీయడానికి వీలుగా కాలువలు ఏర్పాటు చేసుకోవాలి. ఐదు సెంట్ల వరి నారుమడికి పశువుల పెంటతో పాటు, 6కిలోల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్, రెండు కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ వేసి నారుమడి పొలాన్ని తయారుచేసుకోవాలి. నారుమడిలో విత్తనం చల్లే ముందు శిలీంద్రనాశిని కార్బెండజిమ్ 3గ్రాములు లేదా సూడోమోనాస్ ఫ్లోరెసెన్స్ 8గ్రాముల మందును కిలో విత్తనానికి పట్టించి, విత్తన శుద్ధి చేసి నారుమడిలో చల్లాలి. ప్రతి 5సెంట్ల నారుమడికి, విత్తనం చల్లే ముందు 2కిలోల యూరియా, విత్తనం చల్లిన 7–10రోజులకు మరో 2కిలోల యూరియా వేయాలి. అధిక వర్షాల వల్ల నీట మునిగిన వరి నారుమడిలో ఎక్కువగా నిల్వ ఉన్న నీటిని వీలైనంత త్వరగా బయటకు తీసివేసి, 5సెంట్ల నారుమడికి 2కిలోల యూరియా, 4కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ వేయాలి. అధిక వర్షాల వల్ల వరి నారుమడి దశలో ఉన్న స్వర్ణ, ఎంటీయూ–7029 వంటి రకాల్లో పొడ తెగులు ఆశించే అవకాశం ఉన్నందున దీని నివారణకు పొలంలో నిలబడి ఉన్న నీటిని తీసిన వెంటనే ప్రొపికోనజోల్ 1మిల్లీలీటరు లేదా హెక్సాకోనజోల్ 2మిల్లీలీటర్లను నీటికి కలిపి నారుమడిపై పిచికారీ చేయాలి.

తెగుళ్లకు అవకాశం

నారుమడి దశలో లేదా నాటిన కొద్ది రోజుల తర్వాత గాలితో కూడిన వర్షాలు పడుతున్నప్పుడు, వర్షాలు ఎడతెరిపి లేకుండా ఎక్కువ రోజులు కురిసినప్పుడు, ఉష్ణోగ్రత సాధారణంగా ఉంటూ మొక్కల సాంద్రత ఎక్కువగా ఉన్నప్పుడు, నత్రజని ఎరువులు ఎక్కువగా వాడినప్పుడు, నీడ సోకే ప్రాంతాల్లో బాక్టీరియా ఎండాకు తెగులు వ్యాధి తీవ్రతను పెంచుతాయి. ఎంటీయూ–1318, ఎంటీయూ–1121 రకాల్లో ఎండాకు తెగులు వచ్చే అవకాశం ఉంది. ఈ తెగులు సోకితే ఆకు చివర్ల నుంచి కింద వరకు రెండు వైపులా తడిసినట్టు ఉండి, పసుపు రంగుకు మారి ఆకులు ఎండి, మొక్కలు చనిపోతాయి. దీనినే క్రెసెక్ దశ ఎండాకు తెగులు అంటారు. ఈ తెగులు నారుమడి దశలోనూ, నాటిన తొలి దశలోనూ వస్తుంది.

కాలువలు ఏర్పాటు చేసుకోవాలి

నారుమడిలో కాలువలు ఏర్పాటు చేసుకోవాలి. 5సెంట్ల నారుమడికి 2కిలోలు నత్రజని, 1కిలో భాస్వరం, ఒక కిలో పొటాష్ వేయాలి. ఆకు పూర్తిగా బయటకు వచ్చిన తరువాత నీరు నిల్వ ఉంచాలి. జింక్ లోపం ఉంటే 1 లీటరు నీటికి 2గ్రాముల జింక్ సల్ఫేటు స్ప్రే చేయాలి. వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు పాటించాలి.

– శ్రావణ్‌కుమార్, ఏవో, బలిజిపేట

చేపట్టాల్సిన చర్యలు

ఎండాకు తెగులు ఆశిస్తే, నత్రజని ఎరువులు తాత్కాలికంగా నిలిపివేయాలి. తెగులు సోకిన పొలంలో నుంచి నీటిని మురుగు కాలువల ద్వారా బయటకు పంపాలి. కొత్త నీరు మొక్కలకు అందించాలి. ఈ తెగులు గమనించిన వెంటనే ప్లాంటామైసిన్ ఒక గ్రాముతో పాటు కాపర్ హైడ్రాక్సైడ్ 2గ్రాములు లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారీ చేయాలి. నారుమడిలో కలుపు మొక్కలు లేకుండా నివారణ చేయాలి. నిత్తిన 10–15రోజుల తర్వాత, నారుమడిలో ఆశించే పురుగుల నివారణకు(కాండం తొలుచు పురుగు, ఉల్లికోడు) కార్బోఫ్యూరాన్ 3జి గుళికలు సెంటు నారుమడికి 160గ్రాముల చొప్పున రెండింతల ఇసుకతో కలిపి చల్లి, తేలిక పాటి తడి ఇవ్వాలి.

అన్నదాత బిజీ...



కత్తెర పురుగు నివారణకు మందు పిచికారీ చేస్తున్న రైతు



మెట్ట భూమిలో జొన్న పంట



పల్లపు భూమిలో రైతులు వేసిన వరినాట్లు



చెరకు పంటకు జడకట్లు

ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది. వర్షాలు కురుస్తున్నాయి. ఆరుతడి పంట భూముల్లో వరి వెదలు, జొన్న పంట, పచ్చిరొట్ట పంట, చెరకు సంరక్షణ పనులతో పాటు తెగుళ్ల నివారణ పనుల్లో రైతులు బిజీగా ఉన్నారు. నీటి ఎద్దడిని తట్టుకునే మెట్ట ప్రాంతాల్లో వరి వెదలు, మొక్కజొన్న సాగు ప్రారంభించారు. పల్లపు భూముల్లో వరి నాట్లు మొదలయ్యాయి. ఇలా రైతులు అన్ని పంటల సాగులో బిజీగా ఉన్నారు. – సీతానగరం